

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 26 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 233 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY SEPTEMBER 26 2026 | VOL:18 | ISSUE: 233 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి

69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం

క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం

పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక



హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ

(మిగతా 2వ పేజీలో..)

దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ

దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి

వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య

స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని

(మిగతా 2వ పేజీలో..)



ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగితే పోటీ చేయడం ఎందుకు? విపక్షాలకు అభిజిత్ దీప్కే సూటి ప్రశ్న

ఎన్నికల ప్రక్రియ రిగ్గింగ్ అని నమ్మితే విపక్షాలు పోటీ చేయడం ఆపేయాలన్న దీప్కే

ఇదొక ఫిక్స్‌డ్ మ్యాచ్ లాంటిదని అంటున్న సీజేపీ వ్యవస్థాపకుడు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్

లేదంటే అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త ఆందోళనలకు హెచ్చరిక

ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని గట్టిగా విశ్వసిస్తే, ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయడం మానుకోవాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే సూచించారు. ఒకవైపు రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపిస్తూనే, మరోవైపు ఎన్నికల్లో పాల్గొనడం ద్వారా ఆ ప్రక్రియకు ప్రతిపక్షాలే చట్టబద్ధత కల్పిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.ప్రస్తుత

(మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.. ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు

ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

మన్మోహన్ సింగ్ దేశానికి, తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి పొన్నం

ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడిన ప్రభుత్వం



మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు.మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం

(మిగతా 2వ పేజీలో..)

యూపీఐ లావాదేవీలపై చార్జీలు.. వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

ఎండీఆర్ చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న నిర్మల

ఈ చార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే పరిమితమని స్పష్టీకరణ

నిబంధనలపై అవగాహన లోపం వల్లే అపోహలు వ్యాపిస్తున్నాయని వ్యాఖ్య



యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు

(మిగతా 2వ పేజీలో..)

స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి: సీఎం విజయ్ ఆగ్రహం

వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్

డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు

ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ

ఉప ఎన్నికల ప్రచారంలో స్టాలిన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన సీఎం విజయ్

తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు.అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే



ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



సం పా దకీయం

ఈసీఐలో అంతర్గత విభేదాలు.. జ్ఞానేష్ కుమార్‌పై 14 అభ్యంతరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (విజయ కెరటం):

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు వెలుగులోకి వచ్చినట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొంది. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, డేటా నిర్వహణకు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపింది.

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారీ సంఖ్యలో పేర్లు తొలగించడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అయితే తొలగించిన ప్రతి పేరు శాశ్వతంగా ఓటు హక్కును కోల్పోయినట్లు భావించరాదని, ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు అవకాశం ఉంటుందని పేర్కొంది.

జ్ఞానేష్ కుమార్ 1988 బ్యాచ్‌కు చెందిన కేరళ క్యాడర్ ఐఏఎస్ అధికారి. కేంద్ర హోంశాఖ, సహకార మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2024 మార్చిలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులై, 2025 ఫిబ్రవరిలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఇక రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికల సంఘానికి ఎన్నికల పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలు ఉన్నాయి. కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు ఉంటే మెజారిటీ నిర్ణయానికి ప్రాధాన్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈసీఐలోని తాజా అభ్యంతరాలు చర్చనీయాంశంగా మారాయి.

దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి)

ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

యూపీఐ లావాదేవీలపై చార్జీలు.. వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

మొదటి పేజీ తరువాయి)

లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు.ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి... ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

మొదటి పేజీ తరువాయి)

మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.. ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు.తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పనిచేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి: సీఎం విజయ్ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి)

తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి, మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో పోలీసులు బాధితులను గుర్తించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, టీవీకే, డీఎంకే మధ్య ఇది ప్రధాన రాజకీయ పోరాటంగా మారింది.



ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగితే పోటీ చేయడం ఎందుకు? విపక్షాలకు అభిజీత్ దీప్కే సూటి ప్రశ్న

మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులను ఒక "ఫిక్స్డ్ మ్యాచ్"తో పోల్చిన అభిజీత్ దీప్కే... ప్రతిపక్షాలకు అప్పుడప్పుడు, గెలిచే కొన్ని స్థానాలను ఎరగా వేసి, ఎన్నికల్లో నిజమైన పోటీ జరుగుతోందన్న భ్రమను కల్పిస్తున్నారని విమర్శించారు. "ఓట్ల చౌర్యం, ప్రజాప్రతినిధుల కొనుగోలు, పార్టీల చీలికలు జరుగుతున్నాయని ఆరోపిస్తూనే ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారు? మీరు ఏ రకమైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు?" అని ఆయన ప్రతిపక్షాలను సూటిగా ప్రశ్నించారు. రాజకీయ మనుగడ కంటే ప్రజాస్వామ్య విలువలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన హితవు పలికారు. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వచ్చే 24 నుంచి 48 గంటల్లోగా తన పదవికి రాజీనామా చేయాలని దీప్కే డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన వైదొలగకపోతే, అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ముంబై కేంద్రంగా దేశవ్యాప్త నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఉద్యమానికి "జంతర్ మంతర్ 2.0" అని నామకరణం చేశారు. ప్రస్తుతం ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నట్లు వార్తలు రావడం, సీఈసీపై చర్యలు తీసుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో దీప్కే చేసిన



వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

సెప్టెంబర్ । శనివారం । 26 । 2026

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి





సీఎంఓ అధికారి ఎన్.శ్రీధర్ ఆదేశం.. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 25:

వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం కార్యాలయ అధికారి ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు, సిబ్బంది, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, నగర మున్సిపల్ కమిషనర్ టి వెంకన్న సీఎంఓ అధికారి ఎన్.శ్రీధర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష

సమీక్షలో హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ టీ.మాధన్ మోహన్, డీటీసీఓ డాక్టర్ కె.హిమబిందు తదితరులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రాజారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఐ.ప్రకాశ్, డాక్టర్ పి.రవీందర్, మాతా ఆరోగ్య విభాగం డాక్టర్ ఎం.అర్చన తదితరులు పాల్గొన్నారు.రెండు జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని వైద్య సేవలు, సిబ్బంది, ఆసుపత్రులకు అవసరమైన సదుపాయాలు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో చర్చించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

పనుల జాప్యంపై దృష్టి

ఆసుపత్రి నిర్మాణ పనుల్లో మిగిలిన పనులను గుర్తించి వాటికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఎన్.శ్రీధర్ సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, అవసరమైన అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాట్లను వేగవంతం చేయాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

సమీక్ష అనంతరం ఎన్.శ్రీధర్ సంబంధిత అధికారులతో కలిసి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై వివరాలు తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన అనంతరం రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేసి నకిరేకల్ నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పిలుపునిచ్చారు.





నకిరేకల్ సెప్టెంబర్ 25 విజయ కెరటం ప్రతినిధి

శుక్రవారం నల్గొండ జిల్లా, నకిరేకల్ లోని వినాయక బంకేట్ హాల్లో జిల్లా అధికారులతో నిర్వహించిన నకిరేకల్ నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం వెయ్యి రోజులలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ముఖ్యంగా 6 గ్యారంటీలు మొదలుకొని సన్న బియ్యం, స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నదని, విద్య ,వైద్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలన్నింటిని వేగవంతం చేయాలని, మొదలుపెట్టని పనులను తక్షణమే మొదలు పెట్టాలని, మంజూరు కావాల్సిన వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. జిల్లా అధికారులు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ఆదేశాలను ఒక చాలెంజిగా తీసుకొని ప్రత్యేక విజన్ తో క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలని, దీని ద్వారా ప్రభుత్వంతోపాటు, అధికారులకు మంచి పేరు వస్తుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పని చేస్తే ప్రజల సమస్యలను సులువుగా తీర్చవచ్చని అన్నారు. అధికారులు ఆయా శాఖల వారీగా ప్రజలకు అవసరమున్న పనులను, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, రాష్ట్రస్థాయి నుండి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే బాధ్యత తనదని అన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారులకు సంబంధించి పురోగతిలో ఉన్న రోడ్లను వేగవంతం చేయాలని, రామన్నపేట-అమ్మనబోలు రోడ్డు కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వేగవంతం చేయాలని ,తక్కిన రోడ్డను పూర్తి చేయడం, మంజూరు కావలసిన రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పురోగతిలో ఉన్న, దెబ్బతిన్న రోడ్లు, మంజూరు కావాల్సిన రోడ్ల వివరాలను సమర్పించాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కోరారు. అలాగే అంగన్వాడి భవనాలు, గ్రామ సమాఖ్య భవనాలు కూడా వేగవంతం చేయాలన్నారు. గ్రామాలలో గుంతలు పడి పూర్తిగా దెబ్బతిన్న రహదారుల ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆసిఫ్ నగర్ కెనాల్ కు మరమ్మతులు చేపట్టాలని, ఐటిపాముల, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలను వేగవంతం చేయాలన్నారు.ఎల్ నినో దృష్ట్యా ఇరిగేషన్ శాఖ ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని వారబందీ ప్రకారం ఇవ్వాలని కోరారు.నకిరేకల్ నియోజకవర్గానికి జేఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాల బ్రాంచ్ ను తీసుకువచ్చే ఆలోచన ఉందని, అందువల్ల 696 సర్వే నంబర్లో ఉన్న 90 ఎకరాల భూమిని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులతో కోరారు. అలాగే బొల్లారంలో ఉన్న 300 ఎకరాల ప్రభుత్వ భూమిని సంరక్షించే చర్యలు తీసుకోవాలన్నారు. నకిరేకల్ లో బస్టాండు, పోలీస్ స్టేషన్ మార్పుకు సంబంధించిన అనుమతిని తక్షణమే మంజూరు చేయాలని అన్నారు.గ్రామాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా మండలాల వారిగా తాగునీటికి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి, భూగర్భ జలాలు ఎక్కువగా వినియోగిస్తున్న గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా బల్క్ నీటి సరఫరా ఎక్కువ చేసేలా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.చెరువుగట్టు, ఐటిపాముల ప్రాంతాలలో గాంజా వినియోగం ఎక్కువగా ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో అక్కడ ప్రత్యేక టీం లు ఏర్పాటు చేసి గంజాను అరికట్టేందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని, నకిరేకల్ లో పెట్రోలింగ్ పెంచాలని నల్గొండ డిఎస్పి ని ఆదేశించారు .నకిరేకల్ లో నూతనంగా ప్రారంభించుకున్న 100 పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు అన్నింటిని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకు అవసరమైన అంచనాలు రూపొందించి సమర్పించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కోరారు.మంజూరైన సబ్స్టేషన్ల భూసేకరణను వేగవంతం చేయాలని ట్రాన్స్కో సూపరిండెంట్ ఇంజనీర్ తో కోరారు. ఎక్కడైనా లూస్ వైర్లు ఉన్నా, విద్యుత్తు కనెక్షన్ల కోసం డిడీలు కట్టిన వారికి తక్షణమే కనెక్షన్లు మంజూరు చేయాలని అన్నారు.ఎల్ ని నోను దృష్టిలో ఉంచుకొని పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులను ప్రోత్సహించాలని, పాడి ద్వారా చిన్న , సన్న కారు రైతులు ఎక్కువ లాభపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి మండల స్థాయిలో తక్షణమే ఆత్మ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు స్నేహపూర్వక వాతావరణం లో ప్రజలకు సేవలు అందించాలని, ప్రజలు, గ్రామాలు, ప్రాంతాలు బాగుండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో నగరికల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఇంజనీరింగ్ శాఖలు, ఇరిగేషన్, రెవిన్యూ శాఖకు సంబంధించిన అధికారులు వారి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రభుత్వ విప్ కు తెలియజేయడమే కాకుండా, పనులలో వేగం ఉండేలా చూడాలని అన్నారు.స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని, ఇంకా మొదలుపెట్టని వాటిని మొదలుపెట్టాలని, రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, నియోజకవర్గంలో ప్రతిపాదిత పనులు, పథకాలన్నీటిని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు .ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించి చేపట్టిన సమీక్షలో వారి శాఖకు సంబంధించిన పనులు, పథకాల వివరాలను తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి శ్వేత, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల , జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, సింగిల్ విండో చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు

పల్లకి సేవలో భద్రకాళి నగర్ వినాయకుడు..

హన్మకొండ సెప్టెంబర్ 25 విజయ కెరటం ప్రతినిధి..

భీమారం 55 వ డివిజన్ భద్రకాళి నగర్ 2లో గణపతి నవరాత్రులను పురస్కరించుకొని గణనాధుని పల్లకిలో కడప కడపకు తీసుకెళ్లారు. కాలనీ గణపతి ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ గార్ల ఆధ్వర్యంలో కడప కడపకు తీసుకెళ్లినట్లు ఉత్సవ అధ్యక్షుడు రాజు తెలిపారు. కాలనీ మహిళలు పల్లకి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు.కాలనీ లో నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గౌరవ కాలనీ కమిటీ సభ్యులు పిల్లలు,పెద్దలు,మహిళలు గురువులు, పేరు పేరునా అందరికీ ధన్యవాదములు తెలిపారు.



వనం భాస్కర్‌కు అయూబ్ నివాళి

కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: ప్రెస్‌క్లబ్ నేతలు

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 25 :



వరంగల్ తూర్పు నియోజకవర్గ రిపోర్టర్ వనం భాస్కర్ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ శుక్రవారం భాస్కర్ నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భాస్కర్ మృతి పట్ల అయూబ్ విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లపెల్లి సదానందం భాస్కర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా వేముల నాగరాజు, బొల్లపెల్లి సదానందం మాట్లాడుతూ.. వనం భాస్కర్ మృతి జర్నలిస్టు వర్గాలకు తీరని లోటని అన్నారు. భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, తగిన ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు, వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, పలువురు రిపోర్టర్లు, మీడియా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వనం భాస్కర్‌కు నివాళులర్పించారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలి- రాష్ట్ర ఎస్ సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.



అంబేద్కర్ చెప్పినట్లు విద్యతో ప్రపంచాన్ని జయించవచ్చని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్.సి, ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.విద్యార్థులు ఐఏఎస్, ఇంజనీర్, డాక్టర్, లాయర్ తదితర రంగాల్లో రాణించి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.నలగొండ సెప్టెంబర్ 25 విజయ కెరటం ప్రతినిధి శుక్రవారం ఆయన దేవరకొండ డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లి మండలం, డింజలాల్ తండా బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.పాఠశాలలో వంట గది, స్టోర్ రూమ్, పరిసరాలను ఆయన తనిఖీ చేశారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కూరగాయలు, వంటనూనె, పండ్లు, గుడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.తర్వాత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు వాష్‌రూమ్‌లు, కాంపౌండ్ వాల్, బోరు అవసరముందని తెలిపారు.సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అక్టోబర్ 2న గ్రామసభలో తీర్మానం చేసి వీ బిజీ రాంజీ నిధుల కింద పనులకు శంకుస్థాపన చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బోరు కూడా వేయిస్తామని చెప్పారు.విద్యార్థులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూచించినట్లు తరగతి గదిలోనే తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు.ప్రభుత్వం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నందున విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ తియాన్ మావి, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, ఆర్ సి ఓ శ్రీనివాసరావు, ఏ సి ఎం ఓ వెంకటేశ్ నాయక్ ,ఏ టి డి వెంకటేశ్వర్, ఎంపీడీవో స్వర్ణలత, తహసిల్దార్ నరేందర్, ఎంపీ ఓ సుధీర్ కుమార్, సర్పంచ్ గోజ రత్నాల్ , ఉపసర్పంచ్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ శారద ,ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



లక్కీ డ్రాలో సీఎం రేవంత్‌రెడ్డి పేరు

రూ.25 వేల నగదు బహుమతిని కమిటీకి తిరిగి అందించిన సాయికుమార్

సూర్యాపేట సెప్టెంబర్ 25 విజయ కెరటం ప్రతినిధి

సూర్యాపేట: కాసం మణి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన లక్కీ డ్రాలో సీఎం రేవంత్‌రెడ్డి పేరు విజేతగా రావడం ఆసక్తికరంగా మారింది. తోనుకునూరు సాయికుమార్ లక్కీ డ్రా కోసం సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో చీటీ రాయగా, అదే చీటీ విజేతగా ఎంపికైంది.కమిటీ ఆధ్వర్యంలో లక్కీ డ్రా బహుమతులుగా రూ.25 వేల నగదు, 15 కిలోల లడ్డును ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పేరు చీటీ విజేతగా రావడంతో సాయికుమార్‌కు రూ.25 వేల నగదు బహుమతి లభించింది. అయితే ఆ నగదును తన వద్ద ఉంచుకోకుండా కమిటీ సభ్యులకు తిరిగి అందజేశారు. 15 కిలోల లడ్డును మాత్రం స్వీకరించారు.సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో రాసిన చీటీ విజేతగా ఎంపిక కావడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నగదు బహుమతిని తిరిగి అందించిన సాయికుమార్‌ను కమిటీ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాసం మణి యూత్ కమిటీ సభ్యులు కాసం మణి, రామ్‌సాయి, ఎస్. మధు, మామిడి ప్రవీణ్, నారగోని రోహిత్, కాసం విష్ణు, పెండాల ప్రణయ్, గుండగాని శివ, గునగంటి యోగి తదితరులు పాల్గొన్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

చదువు శక్తివంతమైంది

- చదువుకున్న పాఠశాలకు చేయూత.
- రామగిరి ప్రభుత్వ బాలుర పాఠశాల అభివృద్ధికి వైఆర్‌పీ ఫౌండేషన్ అధినేత ఏలిశాల రవిప్రసాద్ చేయూత.
- మరుగుదొడ్ల నిర్మాణానికి హామీ.





నల్లగొండ సెప్టెంబర్ 25 విజయ కెరటం ప్రతినిధి

తాను చదువుకున్న రామగిరి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని పూర్వ విద్యార్థిగా తన బాధ్యతగా భావిస్తున్నానని రవిప్రసాద్ తెలిపారు. పాఠశాల అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే తన సొంత నిధులతో రూ. 1,50,000/– విరాళం అందించి పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వైఆర్‌పీ ఫౌండేషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని రవిప్రసాద్ ప్రకటించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. చదువు శక్తివంతమైనదని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వైఆర్‌పీ ఫౌండేషన్ ఫౌర్మన్ ఏలిశాల రవిప్రసాద్ అన్నారు. తాను చదువుకున్న నల్గొండ పట్టణంలోని రామగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పూర్వ విద్యార్థిగా ఆయన సందర్శించారు. పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వారికి మరియు పాఠశాలకు అవసరమైన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవిప్రసాద్ మాట్లాడుతూ, “చదువుకున్న బడిని, చదువు చెప్పిన గురువులను ఎప్పటికీ మరవకూడదు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు మన జీవితానికి దిశానిర్దేశం చేస్తాయి” అన్నారు. విద్యార్థులతో మాట్లాడుతున్న సమయంలో తన బాల్యాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురైన ఆయన, పుస్తకాలలోని పాఠాలతో పాటు జీవితంలో ఎలా స్థిరపడాలో కూడా తన ఉపాధ్యాయుల నుంచే నేర్చుకున్నానని తెలిపారు. ఆ ప్రోత్సాహమే తన జీవితంలో ముందుకు సాగేందుకు ఎంతో దోహదపడిందన్నారు. పాఠశాల కేవలం చదువు నేర్చుకునే ప్రదేశం మాత్రమే కాదని, భిన్నత్వంలో ఏకత్వం, సమానత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను నేర్పే వేదిక అని రవిప్రసాద్ అన్నారు. వ్యాపార రంగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ పాఠశాలలు, విద్యార్థుల చదువులు, వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తూనే ఉంటానని తెలిపారు. పేద విద్యార్థులు 1వ తరగతి నుంచి ఎంబీబీఎస్ వరకు చదువుకునేందుకు తమ వైఆర్‌పీ ఫౌండేషన్ ద్వారా ఫీజు సహాయం అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, పేద విద్యార్థుల చదువులకు తన వంతు సహాయం కొనసాగిస్తానని ఆయన అన్నారు.

“నిజమైన శ్రీమంతుడు రవిప్రసాద్”

ఈ సందర్భంగా 48 వ డివిజన్ కార్పొరేటర్ యామా కవిత దయాకర్ మాట్లాడుతూ, డబ్బున్న వారు ఎంతో మంది ఉన్నప్పటికీ, తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా ఖర్చు చేసే గుణం కలిగి ఉండటం గొప్ప విషయమన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహాయం చేస్తున్న రవిప్రసాద్ సేవా దృక్పథాన్ని అభినందించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. 41వ డివిజన్ కార్పొరేటర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమని, రవిప్రసాద్ సేవా దృక్పథం ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యామా కవిత దయాకర్, కేసాని వేణుగోపాల్ రెడ్డి, అల్లి సుభాష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, అడ్వకేట్ జిల్లేపల్లి రాఘవ, గుత్తా రవీందర్, గార్లపాటి పురుషోత్తం, వైఆర్‌పీ ఫౌండేషన్ టీం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి అందించిన సహకారానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది ఏలిశాల రవిప్రసాద్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

‘అతడు’ రోజులొచ్చేశాయ్.. యంగ్ లుక్‌లో మహేశ్.. ఫ్యాన్స్ ఫిదా!

రాజమౌళి సినిమా షూటింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేశ్

క్లీన్ షేవ్‌తో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో సరికొత్తగా దర్శనం

మహేశ్ యంగ్ లుక్‌పై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం

సినిమాలోని యువకుడి పాత్ర కోసమే ఈ మార్పా అని ఊహాగానాలు

‘అతడు’, ‘ఒక్కడు’ నాటి లుక్‌ను గుర్తుచేస్తోందని ఫ్యాన్స్ సంబరాలు



సూపర్ స్టార్ మహేశ్ బాబు తన సరికొత్త లుక్‌తో ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్నారు. కొన్నేళ్లుగా గడ్డంతో రఫ్ లుక్‌లో కనిపించిన ఆయన, తాజాగా పూర్తిగా క్లీన్ షేవ్ చేసి మునుపటి కంటే యంగ్‌గా కనిపించడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం ‘వారణాసి’ షూటింగ్‌లో భాగంగా కాశీ షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేశ్, తాజాగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రత్యక్షమయ్యారు. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ఎయిర్‌పోర్టులో ఎంతో ఉల్లాసంగా కనిపించిన మహేశ్, తనను ఫొటోలు తీస్తున్న కెమెరాలను చూసి నవ్వుతూ తన గడ్డం వైపు చూపిస్తూ ‘గడ్డం లేదు’ అన్నట్లుగా చిలిపి సైగలు చేశారు. ఈ దృశ్యాలు చూసిన ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. 51 ఏళ్ల వయసులో కూడా 24 ఏళ్ల కాలేజీ కుర్రాడిలా వెలిగిపోతున్నారంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత మహేశ్‌ను ఇలా క్లీన్ షేవ్‌లో చూడటంతో ‘అతడు’, ‘ఒక్కడు’ సినిమాల నాటి లుక్ గుర్తొస్తోందని, ఆ రోజులు మళ్లీ వచ్చేశాయని సంబరపడుతున్నారు. అయితే, మహేశ్‌లో ఈ ఆకస్మిక మార్పు వెనుక బలమైన కారణమే ఉందనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాజమౌళి సినిమా కోసం మహేశ్ గత రెండేళ్లుగా తన శరీరాకృతిని మార్చుకోవడంతో పాటు గడ్డంతో కూడిన రఫ్ గెటప్‌ను కొనసాగిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన రుద్ర అనే ట్రావెలర్‌గా, శ్రీరాముడిగా విభిన్న కోణాల్లో కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం సినిమాలో దాదాపు 15 నిమిషాల పాటు సాగే ఒక కీలక ఎపిసోడ్‌లో మహేశ్ 24 ఏళ్ల యువకుడిగా కనిపించనున్నారట. ఈ యువకుడి పాత్ర చిత్రీకరణ కోసమే మహేశ్ బాబు క్లీన్ షేవ్ చేసుకున్నారా? లేక కాశీ షెడ్యూల్ ముగియడంతో కాస్త రిలాక్స్ అయ్యేందుకు ఈ లుక్‌లోకి మారారా? అన్నది ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. కారణం ఏదైనా మహేశ్ ‘ఏజ్‌లెస్ హ్యాండ్‌సమ్’ లుక్ అభిమానులకు పండగలా మారింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు రహస్యం తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

‘ఎందుకంత దురద’ వివాదం.. వీడియో విడుదల చేసిన సంపూర్ణేశ్ బాబు!

‘ది ప్యారడైజ్’ సినిమా ప్రమోషన్లలో జర్నలిస్ట్ వ్యాఖ్యలపై దుమారం

జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ పై సంపూర్ణేశ్ బాబు అభిమానుల ఆగ్రహం

క్షమాపణలు చెప్పిన జర్నలిస్ట్, వివాదంపై స్పందించిన సంపూర్ణేశ్

అతడు నాకు సోదరుడి లాంటి వాడు, తప్పుగా అర్థం చేసుకోవద్దన్న నటుడు

జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ తో చోటుచేసుకున్న ఇంటర్వ్యూ వివాదంపై హీరో సంపూర్ణేశ్ బాబు స్పందించారు. నాగేంద్ర కుమార్ తనకు అత్యంత ఆప్తుడని, తమ మధ్య ఉన్న సాన్నిహిత్యం కారణంగానే ఆ వ్యాఖ్యలు వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. అభిమానులు వాటిని తప్పుగా అర్థం చేసుకోవద్దని కోరుతూ ఆయన ఒక వీడియోను విడుదల చేయడంతో ఈ వివాదానికి తెరపడింది.

అసలేం జరిగింది?

సంపూర్ణేశ్ బాబు నటించిన ‘ది ప్యారడైజ్’ చిత్ర ప్రమోషన్లలో భాగంగా జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ ఒక ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆ సందర్భంగా, “మీకు సినీ నేపథ్యం లేదు కదా, మరి పరిశ్రమలోకి ఎందుకొచ్చారు? మీకెందుకంత దురద?” అంటూ నాగేంద్ర కుమార్ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. ఒక నటుడిని ఆ విధంగా కించపరచడం సరికాదంటూ నెటిజన్లు, సంపూ అభిమానులు సదరు జర్నలిస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విమర్శలు వెల్లువెత్తడంతో జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ మాటలు అనలేదని, సంభాషణలో భాగంగా పొరపాటున దొర్లాయని ఆయన వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంపూర్ణేశ్ బాబు స్వయంగా ఒక వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చారు. “నాగేంద్ర గారు నాకు ఎంతో సన్నిహితుడు. ‘హృదయ కాలేయం’ చిత్రం నుంచి జర్నలిస్టులందరూ నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. అందరూ నన్ను ఒక సోదరుడిలా భావిస్తారు. మా మధ్య ఉన్న చనువుతోనే ఆయన ఆ మాటలు అన్నారు. దయచేసి ఎవరూ వాటిని అన్యథా భావించవద్దు” అని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సంపూ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్ సి, ఎస్ టి కమీషన్ చైర్మన్







దేవరకొండ సెప్టెంబర్ 25 విజయ కెరటం ప్రతినిధి

శుక్రవారం దేవరకొండ మండలం కమ్మేపల్లి గిరిజన బాలుర పాఠశాల, కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్, తాగునీరు, విద్యుత్, డార్మిటరీ హాల్ వంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థులు తెలుపగా దీనిపై స్పందించిన చైర్మన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశిస్తామన్నారు. విద్యార్థుల్లో మట్టిలో మాణిక్యాలు ఉంటారని,రేపటి బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని,భవిష్యత్తులో లాయర్లు, ఎస్పీలు, డీఎస్పీలు వంటి ఉన్నత పదవులు చేపట్టే లా విద్యార్థులు ఉండాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాగా చదివి వారి పేరును నిలబెట్టాలని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ వెనుకబడిన గిరిజన జాతి ప్రాంతం విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి సూచిస్తామని, విద్యార్థులు బాగా కష్టపడి చదువుకోవాలని జీవితంలో మంచిగా ఎదగాలని, చదువులో రాణించాలని కోరారు. కమిషన్ సభ్యులు రేణికుంట ప్రవీణ్ ,లక్ష్మీనారాయణ ,జిల్లా శంకర్, డిటిడిఓ కమలాకర్ రెడ్డి ,ఆర్ సి ఓ నరసింహారావు, ఏ టిడి వో వెంకటేశ్వర్లు,ఏ సీఎంఓ. వెంకటేశ్వర్లు నాయక్ , ఎంపీడీవో పార్వతి ,ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలి

సూర్యాపేట సెప్టెంబర్ 25 విజయకేరటం ప్రతినిధి

సెప్టెంబర్ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ గారి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ ఇన్‌చార్జ్ భవ్య తో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి ఓటును నమోదు చేయించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి నియామకాలు కొనసాగిస్తోందని అన్నా రు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ





అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అయితే పట్టభద్రులు గత పాలనను దృష్టిలో ఉంచుకుని తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి పట్టభద్రుడి వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని శివచరణ్ రెడ్డి గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జ్ వెలిమినేటి సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్, నవీన్ ఆచారి, కొత్త విద్య రెడ్డి, శ్రావ్య రెడ్డి, కందుకూరి అంబేద్కర్, నియోజకవర్గాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528